

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

## నిజామాబాద్

## కామారెడ్డి

మంగళవారం 29 జూలై 2025 5 పేజీలు




# ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నాం

## - రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుంది

## - ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ వెల్లడి

**సూర్య నిజామాబాద్ జిల్లా ప్రతినిధి**

ప్రజలకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం తూ.చ తప్పకుండా అమలు చేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ అన్నారు. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం పరిధిలోని లబ్ధిదారులకు మంజూరైన కొత్త రేషన్ కార్డులను సోమవారం జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, అదనపు కలెక్టర్ అంకిత్ లబ్దిదారులకు కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ, గడిచిన 13 సంవత్సరాల తరువాత ప్రజల కొత్త రేషన్ కార్డుల కలను రాష్ట్ర ప్రభుత్వం సాకారం చేసిందని అన్నారు. గత ప్రభుత్వం పదేళ్ల పాలనలో ఒక్క రేషన్ కార్డు కూడా అందించలేదని ఆక్షేపించారు. ప్రజల ఆకాంక్షలను గౌరవిస్తూ, తమ ప్రభుత్వం పెద్ద ఎత్తున కార్డులు అందిస్తోందని గుర్తు చేశారు. ఇది నిరంతర ప్రక్రియ అని స్పష్టం చేశారు. ఇంకనూ అర్హులైన వారు మిగిలి ఉంటే, దరఖాస్తులు చేసుకోవాలని, కార్డులు రాని వారు ఆందోళన చెందాల్సిన (మిగతా 2లో)



### జ్యోతిబాపూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలను

# తనిఖీ చేసిన కలెక్టర్

**సూర్య నిజామాబాద్ జిల్లా ప్రతినిధి**



డిచ్పల్లి మండలం ధర్మారం(బీ) గ్రామంలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలను కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టోర్ రూమ్, కిచెన్, డైనింగ్ హాల్, డార్మెటరీ తదితర వాటిని పరిశీలించారు. స్టోర్ రూమ్ లో నిల్వ ఉంచిన సన్నబియ్యం, నిత్యావసర సరుకుల నాణ్యతను పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. మెనూ బోర్డును పరిశీలించి, మెనూకు అనుగుణంగా భోజనం అందిస్తున్నారా లేదా అన్నది గమనించారు. ఆహార పదార్థాలను భద్రపరిచే విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, పరిశుభ్రమైన వాతావరణంలో భోజనం తయారు చేయాలని నిర్వాహకులకు సూచించారు. ఆహార పదార్థాలు కలుషితం కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని, ఆయా సబ్జెక్టులలో వెనుకబడి ఉన్న విద్యార్థులను గుర్తించి ప్రత్యేక బోధన అందిస్తూ, మరింత మెరుగైన ఫలితాలు వచ్చేలా కృషి చేయాలన్నారు. అధ్యాపకులు, వ్యాయామ ఉపాధ్యాయులు, సిబ్బంది అందరూ సమయ పాలన పాటిస్తూ, అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని హితవు పలికారు. పర్యవేక్షణ అధికారి ఎల్లవేళలా అందుబాటులో ఉండేలా చూడాల న్నారు. టాయిలెట్ లను పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు జరిపించాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని అన్నారు.కాగా, గురుకులంలో ఇంకనూ ఏమైనా సదుపాయాలు అవసరం ఉన్నాయా అని నిర్వాహకులను అడిగి తెలుసు కున్నారు. విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు.





# నేడు దోమకొండకు

# మంత్రి సీతక్క రాక

**సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి**

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి ధనసరి అనసూయ సీతక్క మంగళవారం రోజున దోమకొండ మండల కేంద్రానికి రానున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ జహీరాబాద్ పార్లమె ంట్ సభ్యులు సురేష్ శెట్కార్ తో కలిసి ఆమె స్థానిక పెద్ద పెద్దమ్మ ఆలయంలో నూతనంగా మంజూరైన రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారు. కావున ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు సీతారాం మధు ఒక ప్రకటనలో తెలిపారు.

# పదోన్నతి ద్వారా పోలీసులకు గుర్తింపుతో పాటు విధులపట్ల ఉత్సాహం

## - జిల్లా ఎస్పీ యం.రాజేష్ చంద్ర

**సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి**

పోలీసు వ్యవస్థలో నిరంతర సేవలందించిన ఏఎస్సై డి. నరేందర్ సోమవారం రోజున ఎస్సైగా పదోన్నతి పొందుతున్న ఎల్లారెడ్డి పోలీస్ స్టేషన్‌కు చెందిన ఆయన, సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ. రాజేష్ చంద్ర ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ నరేందర్‌కు పదోన్నతి చిహ్నాలను అలంకరించి, శుభాకాంక్షలు తెలియజేస్తూ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాఎస్పీ రాజేష్ చంద్ర మాట్లాడుతూ.. (మిగతా 2లో)





### ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను

# తక్షణమే పరిష్కరించాలి

## - జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

**సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి**

ప్రజావాణి ద్వారా వచ్చిన అర్జీలను తక్షణమే పరిశీలించి, శనివారం లోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు.సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో, ఐడిఓసి సమావేశ మందిరంలో కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్లు విక్టర్, చందర్ నాయక్ లతో కలిసి ప్రజల నుండి వివిధ సమస్యలపై వచ్చిన 124 అర్జీలను స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాటాడుతూ, ప్రజావాణి కార్యక్రమం ప్రజల సమస్యల పరిష్కారానికి ముఖ్యమైన వేదికగా నిలుస్తోందని పేర్కొన్నారు. వచ్చిన ప్రతి అర్జీని సమగ్రంగా పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు న్యాయం (మిగతా 2లో)

# ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నాం

(మొదటి పేజీ తరువాయి)

అవసరం లేదని సూచించారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు మంజూరు చేస్తామని భరోసా కల్పించారు. ఒక్క నిజామాబాద్ జిల్లాలోనే 11,852 కొత్త రేషన్ కార్డులు మంజూరు చేశామని, మరో 84,232 మంది సభ్యుల పేర్లను కొత్తగా రేషన్ కార్డుల జాబితాలో చేర్చడం జరిగిందన్నారు. ఇందులో భాగంగానే నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలోని నార్త్, సౌత్ మండలాల పరిధిలోని 3174 కుటుంబాలకు కొత్త కార్డులు, 16,687 మంది సభ్యుల పేర్లను కొత్తగా నమోదు చేయడం జరిగిందని వివరించారు. గత ప్రభుత్వ అసంబద్ధ పాలనా విధానాల వల్ల రూ.7.80 లక్షల కోట్ల అప్పుల భారం ఉన్నప్పటికీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రాధాన్యతాక్రమంలో అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సన్న బియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్లు, రైతులకు 22వేల కోట్ల రూపాయల రుణ మాఫీ, 9వేల కోట్ల రైతుబంధు నిధులు ఖాతాలలో జమ, రూ. 500 లకే వంట గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాల అమలు తమ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం అని స్పష్టం చేశారు. సన్న బియ్యం పంపిణీ బీజేపీ పాలిత రాష్ట్రాల్లో సహా దేశంలోనే మరెక్కడా లేదని, కేవలం తెలంగాణలో అమలవుతోందని అన్నారు. పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రతి నియోజకవర్గంలో 3500 ఇళ్లు మంజూరు చేశామని, ఒక్కో లబ్ధిదారుకు రూ. 5 లక్షలు అందిస్తున్నామని తెలిపారు. ఈ నిధులను తిరిగి చెల్లించాల్సిన అవసరం లేదని, ఇందిరమ్మ ఇళ్ల మంజూరీ కోసం ఎవరికీ ఒక్క రూపాయి కూడా ఇవ్వవద్దని సూచించారు. ఎవరైనా లబ్ధిదారుల నుండి డబ్బులు డిమాండ్ చేస్తే నేరుగా తనకు ఫిర్యాదు చేయాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని షబ్బీర్ అలీ హెచ్చరించారు. అదనపు కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, పూర్తి పారదర్శకంగా రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. అర్హులైన వారికి మాత్రమే కార్డులు మంజూరు అయ్యేలా పకడ్బందీ పరిశీలన జరుపుతున్నామని అన్నారు. ఇంకనూ దరఖాస్తుల వెరిఫికేషన్ జరుగుతోందని, అర్హత కలిగిన కుటుంబాలకు కార్డులు మంజూరు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర సహకార సంఘాల యూనియన్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, నుడా చైర్మన్ కేశ వేణు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, డీఎస్ఓ అరవింద్ రెడ్డి, సౌత్, నార్త్ తహసీల్దార్లు బాలరాజు, విజయ్ కాంత్, వివిధ శాఖల అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలి

(మొదటి పేజీ తరువాయి)

కలిగించడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవోతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పదోన్నతి ద్వారా పోలీసులకు గుర్తింపుతో పాటు విధులపట్ల ఉత్సాహం

(మొదటి పేజీ తరువాయి)

పోలీసుశాఖలో పదోన్నతులు మరింత బాధ్యతను పెంచుతాయని అన్నారు. పదోన్న తులు పొందిన పోలీస్ సిబ్బంది రెట్టింపు ఉత్సాహంతో ప్రజలకు సేవలు అందించాలని కోరారు.పోలీసు శాఖలో క్రమశిక్షణతో బాధ్యతగా విధుల పట్ల నిబద్ధతతో వ్యవహరించే ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు, గౌరవ మర్యాదలు లభిస్తాయని ఆయన తెలియజేశారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న పోలీసులకు ఏలాంటి అన్యాయం జరగకుండా తగిన గుర్తింపు వస్తుందని ఆయన అన్నారు. పోలీసులు నిబద్ధతతో పనిచేయాలని ఆయన కోరారు.




## తల్లి తండ్రుల జ్ఞాపకార్థం టైబెల్ట్, యూనిఫామ్ పంపిణీ

**- ఆనందోత్సవాల్లోబంజారాతాండ విద్యార్థినిల తల్లిదండ్రులు**

**- నునుగొండ సత్యనారాయణ మూర్తి**

**సూర్య ఎల్లారెడ్డి**

ఎల్లారెడ్డి డివిజన్ లోని నాగిరెడ్డిపేట మండలం లోని బంజారా తాండ లోని డి ఎన్ టీ పాఠశాలలో చదువుతున్న పేద పిల్లలకు అందులోనే పిల్లలకు పాఠాలు చెప్పే ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న నునుగొండ సత్యనారాయణమూర్తి పాఠశాలలో చదువుతున్న పిల్లలకు 20 వేల రూపాయల విలువ చేసే టైలు , బెల్ట్ లు , యూనిఫామ్ లు తమ తల్లిదండ్రులైన నునుగొండ అన్నపూర్ణ వెంకటయ్య,(రాష్ట్రపతి అవార్డు గ్రహీత ) జ్ఞాపకార్థం వారి పేరిట అందజేశారు, అనంతరం నునుగొండ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ కీర్తిశేషులు అయిన తమ తల్లిదండ్రుల పేరిట ప్రతి సంవత్సరం పేద పిల్లలకు అన్ని రకాలుగా సహాయ సహకారాలు చేస్తున్నానని ఇంకా అనేక రకాల సహాయ సహకారాలు చేయాలని తపన ఉందని అన్నారు పిల్లలు బాగా చదువుకుని విద్యావంతులైతే మీకు అటు తల్లిదండ్రులకు ఇటు ఉపాధ్యాయులకు , గ్రామానికి మంచి పేరు వస్తుందని మంచి పేరు తీసుకురావాలని పిల్లలకు తెలియజేశారు బంజారా తండా పాఠశాల విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందోత్సవాలు జరుపుకున్నారు ఈ కార్యక్రమంలో రిటైర్డ్ విఆర్ఓ ఆత్మకూర్ మాజీ సర్పంచ్ బాల్ రెడ్డి, ఉపాధ్యాయులు రాజశేఖర్ చౌదరి, మోహన్ రెడ్డి, అబ్దుల్ రజాక్, అజీజుల్ రహమాన్ (అప్సర ప్రింటింగ్ ప్రెస్,) ఉపాధ్యాయులు రామ్ చందర్, ప్రియాంక తోపాటు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## యువకుడి అదృశ్యం కేసు నమోదు

**సూర్య మాక్లూర్**



యువకుడు అదృశ్యమైన ఘటన చోటుచేసుకుంది.మాక్లూర్ ఎస్ఐ రాజశేఖర్ కథనం ప్రకారం మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన యువకుడు మదస్తు సందీప్ (24) రోజు మాదిరిగానే శుక్రవారం పాల ఆటో తీసుకొని నిజామాబాద్ వెళ్లి కొత్తపల్లి గ్రామ పంచాయతీ వద్ద ఆటోను వదిలి పెట్టి ఇంటికి వెళ్లలేదని,బంధువుల ఇళ్లలో వెతికిన ఆచూకీ లభించలేదని సోమవారం యువకుడి తల్లి మదస్తు స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు.

## నిజామాబాద్ ను గ్రీన్ సిటీగా తీర్చిదిద్దుదాం

**- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ**

**సూర్య నిజామాబాద్ జిల్లా ప్రతినిధి**



నిజామాబాద్ ను గ్రీన్ సిటీగా తీర్చిదిద్దుదామని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ పిలుపునిచ్చారు. వన మహోత్సవంలో భాగంగా సోమవారం నగరంలోని మారుతీనగర్ లో ఆయన స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ మాట్లాడుతూ, పచ్చదనాన్ని పెంపొందిస్తూ పర్యావరణాన్ని పరిరక్షించేందుకు వీలుగా ప్రభుత్వం వన మహోత్సవం ద్వారా పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహిస్తోందని అన్నారు. కుల, మతాలకు అతీతంగా అన్ని వర్గాల వారు ఈ బృహత్తర కార్యంలో భాగ స్వాములై వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలని సూచించారు. మొక్కలు నాటడం వల్ల ప్రాణికోటికి స్వచ్ఛమైన గాలి లభించడంతో పాటు భవిష్యత్ తరాలు ఆరోగ్యకరమైన జీవనాలు వెళ్లదీసేందుకు మొక్కలు ఎంత గానో దోహదపడతాయని అన్నారు. నిజామాబాద్ జిల్లాలో ఈ ఏడాది 51లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నందున, పూర్తి స్థాయి లక్ష్య సాధనకు సమిష్టిగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఇళ్ల వద్ద మొక్కలు నాటే వారికి కూడా ప్రభుత్వం తరపున ఉచితంగా మొక్కలు అందించడం జరుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర సహకార సంఘాల యూనియన్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, నుడా చైర్మన్ కేశ వేణు, ఇంచార్జి డీఎఫ్ఓ నిఖిత, అదనపు కలెక్టర్ అంకిత్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, నిజామాబాద్ డివిజనల్ ఫారెస్ట్ అధికారి సుధాకర్, వివిధ శాఖల అధికారులు, ఆయా పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

## ఆలయ కమిటీ మెంబర్ల ప్రమాణ స్వీకారం

**సూర్య ఇందూర్**



జిల్లా కేంద్రంలోని పలు ఆలయాలకు ఇటీవల పాలక మండళ్లు ఖరారయ్యాయి. ఈ మేరకు నూతన ఆలయ కమిటీ చైర్మన్లు, ధర్మకర్తల మండలి సభ్యులు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు.ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ఆధ్వర్యంలో కమిటీలతో ప్రమాణ స్వీకారం చేయించారు. జెండా బాలాజీ మందిరం ఆలయ కమిటీ చైర్మన్?గా లవంగ ప్రసాద్, శంభులింగేశ్వర ఆలయ కమిటీ చైర్మన్?గా బింగి మధు ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం శ్రావణమాసం మొదటి సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, సహకార యూనియన్ చైర్మన్‌మానాల మోహన్‌రెడ్డి, నుడా చైర్మన్ కేశవేణు, రైతు కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, బాపూజీ వచనాలయ కమిటీ చైర్మన్ భక్తవత్సలం, సీనియర్? నాయకులు నరాల రత్నాకర్, నగేష్ రెడ్డి, రాంభూపాల్ తదితరులు పాల్గొన్నారు.

## పాల్వంచ ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

**సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి**



కామారెడ్డి జిల్లాలోని మాచారెడ్డి మండల పరిధిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిధిలోగల పాల్వంచ ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆసిస్ సంఘం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో అందుతున్నటువంటి సేవలు గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు ఆసు పత్రిలో చికిత్స కోసం వచ్చిన రోగులతో మాట్లాడి పాల్వంచ ఆసుపత్రిలో ఉన్నటువంటి సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున వైద్యులు వైద్య సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు వైద్యులు వైద్య సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలని ఆసుపత్రిలో వివిధ విభాగాలలో అందుతున్నటువంటి సేవలు గురించి తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు ఈ ఆకస్మిక తనిఖీల్లో భాగంగా జిల్లా కలెక్టర్ తో పాటు జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ చంద్రశేఖర్ ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రభు కిరణ్ ఇతర అధికారులు పాల్గొన్నారు. విధుల పట్ల అలసత్వం గానీ నిర్లక్ష్యం వహించినటువంటి సిబ్బంది పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని జిల్లా కలెక్టర్ ఆదేశించారు మండల ప్రత్యేక అధికారి ఇతర రెవెన్యూ అధికారుల శాఖల అధికారులు తదితరులు ఆయన వెంట ఉన్నారు.

## ప్రజావాణికి 112 దరఖాస్తులు

**సూర్య ఇందూర్:**

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 112 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ తో పాటు, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, డీఆర్డీఓ సాయాగౌడ్, డీపీఓ శ్రీనివాస్, మెప్మా పీడీ రాజేందర్, ఏసీపీ వెంకటేశ్వర్ రావు లకు అర్జీలు సమర్పించారు. కాగా, ఫిర్యాదులను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# ఐ టి ఐ ఏ టి సి ప్రవేశాలకు ఆధునిక కోర్సులలో శిక్షణకు సిద్ధం

సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి

ఐ.టి.ఐ. / ఏ.టి.సీ. ప్రవేశాలు తుది దశకు చేరిన నిర్మాణాలు, ఆధునిక కోర్సులలో నైపుణ్య శిక్షణకు సిద్ధం అయినట్లు ప్రిన్సిపాల్ జి కనకయ్య తెలిపారు.బిచ్కుంద, తాడువాయి, ఎల్లారెడ్డి ప్రాంతాల్లో ఉన్న ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్స్ (ఐ.టి.ఐ.) / అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్స్ (ఏ.టి.సీలు) లో 2025-26 విద్యా సంవత్సరానికి ప్రవేశాల రెండవ దశ కొనసాగుతోంది. ఆసక్తి ఉన్న విద్యార్థులు జూలై 31, 2025 నాటికి ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.ఈ కేంద్రాల్లో అందుబాటులో ఉన్న ముఖ్య నైపుణ్య కోర్సులు: మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్ ఇండస్ట్రియల్ రోబోటిక్స్ & డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ ఆర్టిసన్ యూజింగ్ అడ్వాన్స్ టూల్స్ బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్



వెరిఫైయర్ (మెకానికల్) అడ్వాన్స్ సి.ఎన్.సి. మిషనింగ్ టెక్నీషియన్ మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికల్ అలాగే,ఎలక్ట్రీషియన్, కోపా వంటి సాధారణ కోర్సులు కూడా అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం ఏ.టి.సీ.ల భవన నిర్మాణ పనులు తుది దశలో ఉన్నాయి. పరికరాలు, యంత్రాల అమరిక కూడా చివరి దశకు చేరుకుంది. ఈ కేంద్రాలు టీ-గెట్ (Telangana Gateway of Adaptive Training and Employment) పథకం క్రింద ఆధునిక శిక్షణ మౌలిక సదుపాయాలతో విద్యార్థులకు శిక్షణ అందించేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమ ంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ప్రవేశాల ప్రోత్సాహార్థం ప్రభుత్వం రూపొందించిన పోస్టర్లు, పాంప్లెట్లు ఆవిష్కరించారు. అలాగే ఈ సమావేశ ంలో టీ-గెట్ కమిటీ కామారెడ్డి జిల్లా కన్వీనర్/ ప్రిన్సిపాల్ జి. ప్రమోద్ కుమార్, వైస్ చైర్మన్ మరియు అసిస్టెంట్ లేబర్ కమిషనర్ శ్రీ ఎం. కోటేశ్వర్లు పాల్గొని మాట్లాడుతూ"ఈ ఆధునిక కోర్సులు విద్యార్థులకు పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా శిక్షణను అందించి, మెరుగైన ఉపాధి అవకాశాలను కల్పిస్తాయి" అని పేర్కొన్నారు.

## ధర్నాను విజయవంతం చేయండి

### - టి యు సి ఐ నాయకురాలు సత్తెమ్మ పిలుపు

సూర్య మోర్తాడ్



కేంద్ర రాష్ట్ర ప్రభు త్వాలు కార్మిక వర్గా నికి కనీస వేతనాలు చెల్లించకుం డా జాప్యం చేస్తున్నా యని, ఇందుకు నిరసనగా ఈ నెల 31న ఆర్మూర్ లో గల ఏ ఎల్ ఓ కార్యాలయం ముందు నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని టి యు సి ఐ నాయకురాలు సత్తెమ్మ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీ ఓ అధికారి శ్రీధర్ కు వినతి పత్రం అందజేశారు. అనంతరం సత్తెమ్మ విలేకరుల సమావేశంలో మాట్లా డుతూ, కార్మిక వర్గానికి కనీస వేతనం 26 వేలు ఇవ్వాలన్నారు. కాంట్రాక్టు ఔట్సో ర్సింగ్ కార్మికులకు రెగ్యులరైజ్ చేయాలని కోరారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా కార్మికులకు హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యం ప్రభుత్వం కల్పించాలని అన్నారు. టి యు సి ఐ రాష్ట్ర కమిటీ మేరకు ధర్నా కార్యక్ర మం చేపట్టినట్లు ఈ సందర్భంగా తెలిపారు. అనంతరం మాస్ లైన్ జిల్లా నాయకులు కిషన్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అమరులపూడి అప్పారావు, రాజేష్, నరసింహ,దశరథ్, భూమన్న, తదితరులు పాల్గొన్నారు.

## పట్టణంలో డెంగ్యూ కేసు నమోదు..

### - అప్రమత్తం చేసిన వైద్యాధికారులు

సూర్య- బిక్కనూర్



పట్టణంలో తొమ్మిది సంవత్సరాల చిన్నారికి డెంగ్యూ వ్యాధి సోకడంతో వైద్యుల సూచనల మేరకు హైదరాబాద్ ఆస్పత్రికి తరలించారు. సోమవారం మండల వైద్యాధికారి హేమిమా ఆదేశాల మేరకు ఆరోగ్య విస్తీర్ణ అధికారి వెంకటరమణ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు డెంగ్యూ వ్యాధి ప్రభావిత ప్రాం తంలో ఇంటింటి సర్వే నిర్వహించి పరిసరాల పరిశుభ్రత పై అవగా హన కల్పించారు. ఎవరికైనా జ్వర లక్షణాలు కనిపిస్తే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి లో సంప్రదించాలని సూచించారు. పరిసర ప్రాంతాలలో నీటి నిల్వలను గుర్తించి తొలగించి శుభ్రం చేశారు. పట్టణంలో చిన్నారికి డెంగ్యూ వ్యాధి సోకడంతో పట్టణ ప్రజలు ఆందోళనకు గురయ్యారు.

## భక్తులతో కిటకిటలాడిన సిద్ధిరామేశ్వరాలయం

సూర్య- బిక్కనూర్



మండల కేంద్ర శివారులో ఉన్న దక్షిణ కాశిగా పిలవబడే శ్రీసిద్ధి రామేశ్వర ఆలయం శ్రావణమాసం తొలి సోమవారం కావడంతో భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఈ సందర్భంగా మండలం నుండే కాకుండా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక అభిషేకాలు, పూజలు, సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. ఆలయంలో పూజలు ఆలయ ప్రధాన అర్చకులు కొడకండ్ల రామగిరి శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కార్యనిర్వాహణ అధికారి పద్మా శ్రీధర్ అన్ని ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.

## బస్సు ఢీకొని కార్పెంటర్ మృతి

### - బ్రాహ్మణపల్లి లో విషాదం

సూర్యకామారెడ్డి, జిల్లా ప్రతినిధి



కామారెడ్డి జిల్లా కేంద్రంలో బస్సు ఢీకొన డంతో కార్పెంటర్ మృతి చెందిన ఘటన సోమవారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఈ ఇలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన పైడాకుల నారాయణ( 52) టీవీఎస్ ఎక్సెల్ పై కామారెడ్డికి వచ్చి కార్పెంటర్ పనిచేసే వెళ్లేవాడు. సోమవారం ఉదయం కార్పెంటర్ పని కోసం కామారెడ్డికి వస్తుండగా కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సిరిసిల్ల రోడ్లో కరీంనగర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొనడాంతో పైడాకుల నారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు. తలకు హెల్మెట్ ధరించి ఉంటే బ్రతికే వాడని స్థానికులు తెలిపారు. మరో రెండు నిమిషాల్లో పని పైకి ఎక్కాల్సిన నారాయణ ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ప్రాణాలు వదిలాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుం బ సభ్యులు కామారెడ్డికి వచ్చి బోరున వి లపించారు. బస్సు రూపంలో మృత్యు కాటేసిందని తెలిపారు. కార్పెంటర్ గా కామారెడ్డిలో రెడ్ మేడ్ డోర్ల తయారీ పనులు చేస్తూ ఉండేవాడు. ప్రతి రోజు కామారెడ్డికి వచ్చి కార్పెం టర్ పనిచేసి పైడాకుల నారాయణ స్వగ్రామమైన బ్రాహ్మణపల్లికి వెళ్లేవాడు. సోమవారం ఉదయం ఇంటి నుంచి పని కోసం కామారెడ్డికి వస్తుండగా సిరిసిల్ల రోడ్ లో ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో నారాయణ అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని నారాయణ మృత దేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలిం చారు. పోస్టుమార్టం చేసిన అనంతరం బ్రాహ్మణ పల్లి గ్రామానికి నారాయణ మృతదేహాన్ని కుటుంబ సభ్యులు బంధువులు తీసుకెళ్లారు. మృతుడు నారాయణకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## మద్యం తాగి నడిపితే జైలు శిక్ష తప్పదు

### - ఎస్సై రాము వెల్లడి

సూర్య మోర్తాడ్



నిబంధనకు విరుద్ధంగా మద్యం తాగి వాహనాలు నడిపితే జైలు శిక్ష తప్పదని, ఎస్సై రాము అన్నారు. మోర్తాడ్ మండలం పరిధి రెండు గ్రామాలకు చెందిన ఇద్దరికీ అర్మూర్ స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ గట్టు గంగాధర్ జైలు శిక్ష వేశారని, ఎస్సై తెలిపారు. నిన్నటి రాత్రి మద్యం తాగి న్యూసెన్స్ చేసిన మోర్తాడ్ గ్రామానికి చెందిన జగన్నాథం సాయిబాబా కు 7 రోజులు, తిమ్మాపూర్ గ్రామానికి చెందిన గోపీడి మురళి కి 4 రోజులు జైలుశిక్ష వేశారని, వారిని జైలుకు పంపామని తెలిపారు. ఎవరు కూడా మద్యం తాగి న్యూసెన్స్ చేయకూ డదని, అతివేగంగా వాహనాలు నడపకూడదని మోర్తాడ్ SI బి. రాము తెలుపారు.

## గోసేవ సమితి - పంచమికి ఆవు పాల పంపిణీ

సూర్య - మోపాల్

నాగుల పంచమి మంగళవారం ఉదయం 6 గంటలనుండి ఇందూర్ గోసేవ సమితి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంతో పాటు పరిసర గ్రామాల భక్తులకు ఆవు పాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు సమితి అధ్యక్షుడు రమేశ్ తెలిపారు. గోడ పత్రుల ఆవిష్కరణ లో ప్రధాన కార్యదర్శి లక్ష్మికాంతం కోశాధికారి యాదగిరి పాల్గొన్నారు.

## మహా రుద్రాభిషేకం మహోత్సవం

సూర్య రెంజల్



మండలంలోని కందకుర్తి గోదావరి నది తీరాన ఉన్నటువంటి శ్రీ సీతారాం త్యాగి మహారాజ్ ఆశ్రమంలో మహా రుద్రాభిషేకం మహోత్సవం ఘనంగా నిర్వహించారు.శ్రావణ మాసంలో మొదటి సోమవారం ని పురస్కరించుకొని శివలింగాలను తయారు చేసి పూజ కార్యక్రమాలను నిర్వహించారు. శ్రీ సీతారాం త్యాగి మహారాజ్ గారి ఆధ్వర్యంలో రుద్రాభిషేకాన్ని చేపట్టారు. శ్రావణమాసంలో శివునికి రూపంగా కొలిచే మహాలింగాలను తయారు చేసి వాటికి రుద్రాభిషేకం వేద పండితుల మంత్రోచ్ఛరణల ద్వారా మహా రుద్రాభిషేకాన్ని దంపతులు, మహిళలు, భక్తుల చేత ఘనంగా చేపట్టారు. అనంతరం మహా అన్న ప్రసాదాల కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాకులు, కమిటీ నిర్వాకులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

## రాజకీయ ఒత్తిళ్లకు మేరకే ఇల్లు మంజూరు చేయలేదు

సూర్య రెంజల్



ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపట్టే వాటిలో మంజూరు చేయటంలో రాజకీయ ఒత్తిళ్ళ మేరకే లబ్ధిదారులైనటువంటి చాకలి స్వప్న మంజూరు చేయలేదని ఎంపీడీవో కమలాకర్ కు ఫిర్యాదు చేశారు. సోమవారం రెంజల్ మండలంలోని కందకుర్తి గ్రామానికి చెందిన లబ్ధిదారురాలు ఫిర్యాదు చేశారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో తన పేరు లిస్టులో వచ్చినప్పటికీ మంజూరులో చూపకుండా రాజకీయ ఒత్తిళ్ళ మేరకు అడ్డుకుంటున్నారని ఆమె వాపోయారు. ఎంపీడీవో బాధితురాలికి న్యాయం జరిగేలా చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. ఫిర్యాదు చేసిన వారిలో ఆమె భర్త ఉన్నారు.

## మాజీ ఫుడ్ కమిషన్ చైర్మన్ ను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

సూర్య- బిక్కనూర్



రాష్ట్ర మాజీ ఫుడ్ కమిషన్ చైర్మన్ కొమ్ముల తిరుమలరెడ్డి కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ సోమవారం పరామర్శిం చారు. రెండు రోజుల క్రితం తిరుమల్ రెడ్డి తల్లి అనారోగ్యంతో మృతి చెందిన విషయాన్ని తెలుసుకొని, మండలంలోని లక్ష్మీదేవుని పల్లి గ్రామంలో ఉన్న కొమ్ముల తిరుమల్ రెడ్డి ఇంటికి వెళ్లి పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే వెంట రామేశ్వర్ పల్లి సొసైటీ చైర్మన్ భూమి రెడ్డి, అంతంపల్లి సొసైటీ చైర్మన్ వలకొండ వెంకట్ రెడ్డి, తిప్పాపూర్ సొసైటీ చైర్మన్ ఏనుగు వెంకట్ రెడ్డి, మాజీ ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు దాయారి సాయిరెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు బోండ్ల రామ చంద్రం, తక్కల్ల రవీందర్ రెడ్డి, కోడూరి సాయగౌడ్ పార్టీ నాయకులు ఉన్నారు

### బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన మాజీ ఎమ్మెల్యే

సూర్య- బిక్కనూర్



మండలంలోని జంగంపల్లి గ్రామా నికి చెందిన సార్గు లింగం అనే వ్యక్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ బాధిత కుటుంబానికి తక్షణ సహాయం కింద 5 వేల రూపాయలను పంపించారు. ఈ మేరకు సోమ వారం బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మండలాధ్యక్షుడు అత్తిలి శ్రీనివాస్ మాజీ ఎమ్మెల్యే పంపిన డబ్బులను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ గ్రామ అధ్యక్షుడు మెంగని బాలచంద్రం, పార్టీ నాయకులు ఉన్నారు.

## డబుల్ బెడ్ రూంల లబ్ధిదారుల కేటాయింపుపై విచారణ జరిపించాలి

సూర్య- బిక్కనూర్



మండల కేంద్రంలో గత ప్రభుత్వ హయంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ల లబ్ధిదారుల కేటాయింపులో అక్రమాలు చోటు చేసుకున్నా యని,టిజివిపి నియోజకవర్గ ఇన్చార్జి సమీర్ ఆరోపించారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కొందరు అనర్హులకు డబుల్ బెడ్ రూమ్ లను కేటాయించారని, ఇందులో ఉద్యోగులకు కూడా కేటాయించారని, స్థానిక తాజా మాజీ సర్పంచ్ తునికి వేణు అధికారులతో కుమ్మక్కై కొందరు అనర్హులకు డబుల్ బెడ్ రూమ్ లను కేటాయించారని కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించాడు. దీనిపై విచారణ జరిపించి అర్హులకు అందే విధంగా చర్యలు తీసుకుంటానని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు సమీర్ ఖాన్ తెలిపారు.

# తెలంగాణ గర్వించదగ్గ మహాకవి సినారె

## - తె ర వె జిల్లా అధ్యక్షులు గఫూర్ శిక్షక్

**సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి**

సోమవారం రోజున సినారె జయంతి సినారె అంటే నవ కవిత్వానికి చిరునామా ఆయన కవిత్వంలో శబ్దశక్తి అద్వితీయంగా ఉంటుంది. ప్రతీకలు పొందిక శబ్దశక్తి ప్రతి పాదాన్ని కట్టిపడేస్తూ ఆలోచింపజేస్తూ రస ఆస్వాదనకు అవకాశం ఇస్తుంది ఆయన ఎన్నో రచనలు చేశారు. ప్రతి రచనలోనూ వర్ణలను ఆకట్టుకుంటూ సాగుతాయి శబ్దశక్తి వల్లనే ఆయన గజల్ రూబాయిలు, కవిత్వం గొప్పగా రాయగలిగారు నా ఇంటిపేరు చైతన్యం కవిత్వం నా మాతృభాషగా ప్రకటించుకున్న మహాకవి సినారె ప్రతి రచనలో కళాత్మకంగా వైజ్ఞానికంగా ఆధ్యాత్మికంగా సామాజికంగా అన్ని అంశాలను స్పర్శించారు ఆయన రాసిన విశ్వంభర జ్ఞానపీఠ పురస్కారాన్ని అందుకొని తెలంగాణ ప్రాంతానికి ఎంతో కీర్తి గౌరవాన్ని సంపాదించి పెట్టింది. ఆయన రచనలు చైతన్య ప్రతీకలు ఆయన రచనలు జీవితం ఎంతోమందికి ఆదర్శం



తెలంగాణ ప్రాంతం గర్వించదగ్గ మహాకవి సినారె నేటి తరానికి చెందిన కవులకు ఆదర్శం ఆయన రచనలు ఎన్నో ఉన్నాయి వాటిని అధ్యయనం చేయాల్సిన బాధ్యత రచయితలపై ఉంది మనసు శక్తి ఒక వ్యక్తిగా సాగితే జీవిత చరిత్రగా సమిష్టిగా సాగితే సమాజ చరిత్రగా ఎలా కనిపిస్తుందో సినారె కలం దాన్ని ఒడిసి పట్టుకొని మన ముందు నిలుపుతుంది . సినారె ఒక అభ్యుదయ వాది సినారె ఒక సామాజిక వాది సినారె ఒక తత్వవేత్త ఒక ఆదర్శకవి ఒక రచయిత సినారె లాంటి కవులు ఎవరు లేరనడం అతిశయోక్తి కాదు శబ్దాలను అతికేశక్తి మహా అద్భుతమైనది అలాంటి మహా అద్భుత శక్తి సినారె కలానికి సొంత మయ్యింది. నేను పుట్టకముందే నెత్తిమీద నీలితెరా కాళ్ళ కింద ధూళిపోరా ఆ తెరకు అద్దిన అద్దాల బిళ్ళలో మినుగురులు కనురెప్పలు మిడకరించాయి చిచ్చు ముద్దల్లోంచి చిమ్ము కొచ్చిన పచ్చని వెలుగులు పాలమీగడల్లా పరుచుకున్నాయి భూమి ఆకాశాల పుట్టుక నుంచి మొదలై కాలం స్వరూపాన్ని మనిషి వికాసాన్ని చైతన్యాన్ని ఆ చైతన్యం ప్రదర్శించిన విశ్వరూపాన్ని అనేక విధాలుగా తన రచన అయిన విశ్వంభరలో సినారె ఆవిష్కరించారు. ఎన్నో రచనలు చేసిమధురమైన సినీ గీతాలను పాటలను ఎన్నటినో రాశారు. అద్భుతమైన పాటలు సినారె కలం నుంచి జాలు వారి నయ్ అనేక గజల్లు రూపు దిద్దుకు న్నాయి ఉర్దూ మాధ్య మంలో



ఆయన డిగ్రీ వరకు చదవ డం వల్ల శబ్దశక్తి ఆయన రచనలలో ప్రవాహా ముల ముందు కెళ్ళింది ఎన్నో పాటలను రాసి అందరి మెప్పును పొందినటువంటి మహాను భావుడు సినారె ఎన్నో పదవులను ఏలినా కానీ తెలుగు సంస్కృతిని మరువకుండా తన ఆచార వ్యవహారాలలో ఆయన తెలుగు సాంప్రదాయాన్ని ప్రదర్శింప చేశారు సినారె రచనలు ఎందరినో ప్రభావితం చేశాయి ఎన్నో అవార్డులు ఆయనను వరించాయి ఎన్నో పదవులు సినారె సొంతమ య్యాయి ఎంతోమంది కవులను ఆయన శిష్య లుగా మలిచాయి ఆయన రచనలు ఆదర్శం ఆయన జీవితం ఆదర్శం కవిగా ఎదిగి జ్ఞాన పీఠాన్ని సొంతం చేసుకున్న మన తెలంగాణ ఆణిముత్యం సినారె జన్మదినం కవులందరికి పండుగ రోజే అని అన్నారు. గఫూర్ శిక్షక్.

## బోనాల వేడుకల్లో పిట్ల శ్రీధర్..

**సూర్య- బాన్సువాడ.**



హైదరాబాద్లోని అడ్డగుట్ట లో జరిగిన అమ్మవారి బోనాల వేడుకల్లో వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షుడు పిట్ల శ్రీధర్ పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. బాన్సు వాడకు చెందినశ్రీధర్ జాతీయ వడ్డెర సంఘం అధ్యక్షునిగా ఎన్నికైన తర్వాత అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించడంతో వడ్డెర కులస్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఈ సందర్భంగా శ్రీధర్ తో పాటు యువజన అధ్యక్షుడు వేముల భరత్ ,వడ్డెర సంఘం నాయకులను జాతీయ వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వల్లేపు శివకుమార్ శాలువా పూలమాలతో ఘనంగా సత్కరించారు.కార్యక్రమంలో వడ్డెర సంఘం సీనియర్ నాయకులు రూపాని లోకనాదం, పిట్ల గోపాల్, వల్లేపు మొగలి, శివరాత్రి ఐలమల్లు, పిట్ల మల్లేష్, ఎత్తరీ మారయ్య, ఒళ్ళేపు చంద్రశేఖర్, పల్లపు రమేష్, ఒళ్ళేపు గణేష్, దండుగుల శేఖర్, ఒళ్ళేపు గిరీష్, శివరాత్రి ఎల్లయ్య, గండికోట యాదయ్య, కొమ్మరాజుల శేఖర్, రూప మహేశ్వరి, బీదర్ గణేష్, ధనలక్ష్మి, ఖమ్మం వీరన్న, ఓర్సు బాలకృష్ణ, దండుగుల స్వామి, సంపంగి శంకర్, గౌళ్ళిం యాదగిరి, మాజీ కార్పొరేటర్ నరసింహ, ఒంటిపులి బాబు, చేవెళ్ల రామచంద్రయ్య, జెరిపటి రాజు, గండయ్య, మక్కల శంకర్, తార్నాక శ్రీనివాస్ వడ్డెర కులస్తుల పాల్గొన్నారు.

## విద్యార్థులకు దంత పరీక్షలు..

**సూర్య- నవీపేట్**



మండల కేంద్రంలో గల ప్రభుత్వ బాలురు ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు ఉచిత దంత పరీక్షలు నిర్వహించారు. నవత దంత వైద్యశాల వైద్యులు డాక్టర్ కవిత దాదాపు 290 మంది విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించి కొంత మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు అవసరమని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. విద్యార్థులు దంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, రోజుకు రెండుసార్లు బ్రష్ చేసుకోవాలని సూచించారు. అలాగే అతి చల్లటి పదార్థాలను, అతి వేడి పదార్థాలను తీసుకోరాదని తెలుపుతూ విద్యార్థుల ందరికీ దంతాల సంరక్షణ పట్ల పూర్తి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జీధిద్య, పిఆర్టియు జిల్లా అధ్యక్షులు మోహన్ రెడ్డి, మండల అధ్యక్ష కార్యదర్శులు పెద్దోళ్ళ భూమయ్య, శివకుమార్, వెంకటేశం, మేక సుధాకర్ రెడ్డి, భోగ లక్ష్మణ్, లోక ప్రవీణ్ తో పాటు పాఠశాల ఉపాధ్యాయలు పాల్గొన్నారు.

## నాగుల చవితికి ముస్తాబైన లింగం గుట్ట..

**సూర్య- నవీపేట్**



మండల కేంద్రంలో గల శ్రీ శనీశ్వర సహిత స్వయంభు శివాలయం లింగం గుట్ట శ్రీశ్రీశ్రీ రాజయోగి సిద్దేశ్వర మహారాజ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించే నాగుల చవితి పండ గకి ముస్తాబైంది. శ్రావణమాసంలో దీపావళి అమావాస్య తర్వాత వచ్చే కార్తీక శుద్ధ చతుర్థి పరమ పవిత్రమైన నాగుల పంచమి రోజున స్వయంభూ శివాలయంలో ఉపాలయంగా విరజిల్లుతున్న మానస దేవి, నవ నాగులకు, శ్వేతనాగు నిలయమైన స్వయంభు నాగపుట్ట వద్ద ముఖ్యంగా మహిళ భక్తులు పాలు పోసి, నాగదేవతకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తే సర్ప దోషాలు, వ్యాధి దోషాల నుండి రక్షణ లభిస్తుందని. సామాజిక సర్వశాంతి పూజలు నిర్వహించబడతాయని నిర్వాహకులు తెలిపారు. పూజలో పాల్గొనే భక్తులు ఉదయం 8:30 గంటలకు సాంప్రదాయ దుస్తుల్లో లింగం గుట్టకు చేరుకోవాలని తెలిపారు.

## విద్యార్థులకు బుక్కులు, పెన్నుల పంపిణీ..

**సూర్య- నవీపేట్**



మండలంలో గల అభం గపట్నం ప్రభుత్వ పాఠశాలలో సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు బుక్కులు, పెన్నులను పంపిణీ చేశారు. సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్, తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు చట్టం చైర్మన్ డాక్టర్ సాప పండరి తో కలిసి మండల అధ్యక్షుడు డి రాకేష్ తన సొంత ఖర్చుల తో బుక్కులు, పెన్నులను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ. రాకేష్ యొక్క సేవలను మాటల రూపంలో చెప్పలేమని, రాతల రూపంలో రాయలేమని, ఎంత వర్ణించినా తక్కువేనని, అనేక సేవా కార్యక్రమాల్లో ముందుండి తన సహాయ సహకారాలు అంది స్తాడని అన్నారు. రాకేష్ చేస్తున్న ప్రతి సేవా కార్యక్రమాన్ని అనునిత్యం గమనిస్తున్నామని, స్వార్థము, ఈర్ష, రాగద్వేషాలు లేని సజ్జనుడని కొనియా డారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సక్కి అశోక్, పిఆర్టియు జిల్లా అధ్యక్షులు మోహన్ రెడ్డి, మండల అధ్యక్ష కార్యదర్శులు పెద్దోళ్ళ భూమన్న, శివకుమా ర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు జేధిధ్య, సుధాకర్ రెడ్డి రవీందర్ రెడ్డి రాజేంద్రప్రసాద్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ వినోద, మరియు సంస్థ ప్రతినిధులు రాజు, సిద్దు తదితరులతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

## పాల్వంచ స్కూల్లో టాయిలెట్ నిర్మాణ పనుల ను పరిశీలించిన రోటరీ ప్రతినిధులు

**సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి**



కామారెడ్డి జిల్లా పాల్వంచ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం నిర్మింప తలపెట్టిన టాయిలెట్ బ్లాక్ ల నిర్మాణాన్ని రోటరీ క్లబ్ పాస్ట్ డిస్టిక్ గవర్నర్ హన్మంత రెడ్డి సోమవారం రోజునసందర్శించారు. రోటరీ అసిస్టెంట్ గవర్నర్ జైపాల్ రెడ్డి , ప్రెసిడెంట్ శంకర్ మరియు సెక్రెటరీల కృష్ణహరి ల తో కలిసి స్కూల్ కు విచ్చేసిన హనుమంత్ రెడ్డి , పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోవర్ధన్ రెడ్డి సమక్షంలో తాపీ మేస్త్రీని వివరాలు అడిగి తెలుసుకున్నారు. వివిధ సేవా కార్యక్రమాలలో భాగంగా, రోటరీ సహకారం తో జరుగుతున్న ఈ నిర్మాణ పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కొన్ని రోజు ల్లోనే పని పూర్తవుతుందని, విద్యార్థులకు టాయిలెట్లు అందుబాటులో రావడం వల్ల మరింత సౌకర్యవంతంగా ఉంటుందని వారు తెలియజేసా రు.పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు రోటరీ క్లబ్ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు.

## శ్రావణ మాసం లో - ఆలయాలకు శ్రావణ శోభ

**సూర్య -మోపాల్**



శ్రావణమాసం మొదటి వారం కావడంతో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, నిర్వహించారు. ప్రముఖ ఆలయాలు శ్రావణ శోభను సంతరించుకున్నాయి.నగరంలోని నీలా కంఠేశ్వరాలయం,శంభుని గుడి లో భక్తులు శివలింగానికి అభిషేకాలు నిర్వహించారు. శ్రావణమాసం సందర్భంగా ఆలయాలు కిటకిట లాడాయి. శ్రావణమాసంలో భక్తులు ఉపవాసాలు నియమంగా పాటిస్తారు. మహిళలు ఉపవాసాలు చేస్తూ వాయినాలిచారు. ఆలయాల్లో అమ్మవార్లకు ఒడి బియ్యం సమర్పించి కుంకుమర్చనలో పాల్గొంటారు. జిల్లాలోని అన్ని గ్రామాలలో శైవ క్షేత్రాలు ముస్తాబు చేసారు. విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులకోసం ఆలయ దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. శివుడికి ప్రీతి పాత్రమైన శ్రావణమాసంలో భక్తులు శివాలయాల్లో విశేషంగా పూజలు నిర్వహిస్తారు. ఈ మాసంలో పూజలు చేస్తే అంత మంచి జరుగుతుందని భక్తుల విశ్వాసం.

## నిజాయితీకి మారుపేరు.....

### - కొరుపుల మహేందర్ ను అభినందించిన జిల్లా పోలీసులు

**సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి**



కామారెడ్డి పట్టణంలోని స్థానిక నిజాంసాగర్ రోడ్లో గత గురువారం రాత్రి గం 11:16 ని.లకు RK డిగ్రీ కాలేజ్ జీవదన్ హై స్కూల్ మధ్యలో ఒక పెద్ద సూట్ కేస్ కామారెడ్డి పట్టణానికి చెందిన విలేఖరి,మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు కొరుపాల మహేందర్ కు దొరికినది వెంటనే అతను కామారెడ్డి ఎస్సై బాల్ రెడ్డి కి సమాచారం అందించి అదే రోజు రాత్రి పోలీస్ స్టేషన్లో సూట్ కేస్ ను అప్పజెప్పనైనది. ఆ సూట్ కేసులో విలువైన వస్తువులు, సీసీ కెమెరా, పాస్పోర్ట్ ,ఆధార్ కార్డ్ , పాన్ కార్డ్, ఓటర్ ఐడి కార్డ్ , ఏటీఎం కార్డ్ మరియు మిగతా డాక్యుమెంట్ల ఆధారంగా బాధితునికి ఫోన్ చేసి తెలియపరచగా మహారాష్ట్రకు చెందిన పర్భని వినోద్ కుమార్ ఈరోజు సోమవారం కామారెడ్డి పోలీస్ స్టేషన్ కు వచ్చి ఎస్ఐ రాజారాం, సంఘ పెద్దలు పాక నారాయణ కొరుపాల సురేష్ లాలి రాజు సమక్షంలో కొరుపాల మహేందర్ బాధితుడు వినోద్ కుమార్ కు అందజేసి మానవత్వాన్ని చాటుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసు అధికారులు మహేందర్ ను అభినందించారు.

సూర్య
www.suryaa.com



# రాజరాజేశ్వర ఆలయంలో కాంగ్రెస్ నాయకుల కుటుంబ సమేత దర్శనం

## - ప్రజల శ్రేయస్సు, పాడి పంటల ఉజ్వల భవిష్యత్తు కోసం పరమశివునికి ప్రార్థనలు

## - మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రజిత వెంకటరామిరెడ్డి

**సూర్య ఎల్లారెడ్డి**

ఎల్లారెడ్డి మండలంలోని వెల్లుట్ల పేట గ్రామంలో ఉన్న పవిత్ర శైవక్షేత్రం రాజరాజేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు కుటుంబ సమేతంగా భక్తిశ్రద్ధలతో దర్శనం చేసుకున్నారు. గ్రామస్తుల ఆహ్వానానికి స్పందనగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత వెంకట్రాం రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, సొసైటీ మాజీ చైర్మన్ బోండ్ల సాయిలు, తిమ్మారెడ్డి గ్రామ మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, సొసైటీ డైరెక్టర్ సుఖేందర్ రెడ్డి తమ కుటుంబ సభ్యులతో కలిసి



స్వామివారి సన్నిధిని చేరి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని తీర్థప్రసాదాలను అందుకొని, భక్తులతో కలిసి స్నేహపూర్వక వాతావరణంలో అన్నప్రాసన చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రజిత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ మండల ప్రజల సుఖసంతోషాలు, సంపదలతో నిండిన జీవితం, పాడిపంటలతో సంపన్నత కోసం వారు పరమశివుడిని ప్రార్థించారు. ఈ భక్తిపూరిత కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఘంటసాయిలు, గ్రామ ప్రముఖులు గణపతి తదితరులు పాల్గొన్నారు. గ్రామస్తుల ఆతిథ్యానికి నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు మరింత సాన్నిహిత్యం, విశ్వాసం కలిగేలా ఈ పర్యటన ఆదర్శంగా నిలిచింది..!

# సమ్మె నోటీస్ ఇచ్చిన మధ్యాహ్న భోజన నిర్వాహకులు

**సూర్య,లింగంపేట్**



తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతు సోమవారం మండల విద్యాధికారి షాకత్ అలీకి మధ్యాహ్న భోజన నిర్వాహకులు సమ్మె నోటీసు ఇచ్చారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన నిర్వాహకుల మండల అధ్యక్షుడు చింతకుంట రాజు మాట్లాడుతూ విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో గుడ్లు పెట్టిన గుడ్ల డబ్బులు పడటం లేదని అన్నారు. తమ సమస్యలు పరిష్కరించే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి పరిష్కరించాలని కోరారు. ఆగస్టు ఒకటి నుండి పాఠశాలలో మధ్యాహ్న భోజన అందకుండా నాలుగోవ తేదీ వరకు సమ్మె కొనసాగిస్తామన్నారు. అయిన తమ సమస్యలు పరిష్కరించకపోతే నిరవధిక సమ్మె చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మధ్యాన భోజనం వివాహకులు నిజ్జన రామలింగం, సంద బాలయ్య, కిష్టయ్య, లక్ష్మి, పాల్గొన్నారు.

# మీనాక్షి నటరాజన్ ను కలిసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

**సూర్య నిజాంసాగర్**



– తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ ను జుక్కల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం కలిశారు. హైదరాబాదులోని గాంధీభవన్ లొ ఆమెతో కలిసిన వారిలో నిజాంసాగర్ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్, మల్లూరు గ్రామానికి చెందిన ఎన్నారై భుజం గారి భాస్కర్ రెడ్డి, సాయి పటేల్ లో ఉన్నారు. వెనుకబడిన జుక్కల్ నియోజకవర్గ అభివృద్ధి కోసం సహకరించాలని మీనాక్షి నటరాజన్ ను కోరినట్లు నాయకులు తెలిపారు. జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు ఆదేశాల మేరకు మీనాక్షి నటరాజన్ ను కలిసినట్లు నిజాంసాగర్ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న పథకాలను గ్రామాల్లో ప్రజలకు అర్థమయ్యే విధంగా వివరించాలని ఆమె తెలుపడం జరిగింది అన్నారు. సంక్షేమ ఫలాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని స్థానిక సంస్థల ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించాలని సూచించడం జరిగింది అన్నారు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అన్ని పథకాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని ఆమె సూచించారన్నారు. జుక్కల్ నియోజకవర్గ అభివృద్ధికి కోసం ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు నిరంతరం కృషి చేస్తున్నారని ఆమెకు తెలపడం జరిగిందన్నారు. నియోజకవర్గ స్థాయి లోకల్ బాడీ ఎన్నికలు, జుక్కల్ అభివృద్ధిపై చేపట్టాల్సిన కార్యాచరణ, 42% బీసీ రిజర్వేషన్ల అమలు, బీసీ వర్గాల సామాజిక న్యాయానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉన్నదని, వాటిని రాజకీయంగా ప్రాతినిధ్యం కలిగించడమే లక్ష్యంగా నిర్ణయాలు తీసుకుంటామని మీనాక్షి నటరాజన్ హామీ ఇచ్చారన్నారు. జుక్కల్ నియోజకవర్గం అభివృద్ధికి సహకరిస్తామని ఆమె తెలపడం జరిగిందన్నారు

# కేజీబివి విద్యార్థులకు సైబర్ క్రైమ్ పై అవగహన

**సూర్య బాల్కొండ/ముప్కాల్**

ముప్కాల్ మండల కేంద్రంలో గల కేజీబీవీ పాఠశాలలో ముప్కాల్ పోలీస్ సిబ్బంది కేజీబీవీ పాఠశాలలో సైబర్ క్రైమ్స్ గురించి విద్యార్థులకు అవగహన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల స్పెషల్ ఆఫీసర్ జీ. వినోద, ముప్కాల్ హెడ్ కానిస్టేబుల్ కే. మల్లేశం, కానిస్టేబుల్స్ రాజేందర్, హరీష్ ,సాయినాథ్, పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొనడం జరిగింది.

# నేడే నాగుల పంచమి

**సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి**



నాగుల పంచమి పర్వదినం నేడు హిందువుల అత్యంత భక్తి భావంతో నాగదేవతను పూజించే శుభదినం ప్రతి సంవత్సరం శ్రావణ శుద్ధ పంచమి నాడు వస్తుంది దీనినే గరుడ పంచమి కూడా జరుపుకుంటారు. అయితే సహజంగా హిందూ పంచాంగం ప్రకారం ఉదయం వచ్చిన తిధినే ప్రామాణికంగా తీసుకుంటాం కాబట్టి నాగపంచమిని నేడు అందరూ జరుపుకోనున్నారు.. నాగ పంచమి సందర్భంగా ముఖ్యంగా ప్రముఖ శైవ క్షేత్రాలు భక్తులతో సందడిగా మారాయి. ఈ సంవత్సరం పవిత్రమైన శ్రావణ శుక్రవారం రోజు నాగుల పంచమి రావడం కూడా విశేషయోగంగా చెబుతారు. ఇదే తొలి శ్రావణ శుక్రవారం కూడా కావటం విశేషం.

**నాగపంచమి పై పురాణ గాథలెన్నో**

మనదేశ సంస్కృతిలో నాగ దేవతకు పూజలు చేసే విధానం అనాదిగా ఆచారంలో ఉంది. నిత్యం పూజించే నారాయణుడి శేష శయనుడి పర్వమే ఈ నాగ పంచమి అని చెప్తారు. శివుడి మెడలో అలంకారమైన నాగదేవతను ఈ రోజు హిందువులు పూజిస్తారు. నాగ దేవతతో పాటు శివుడిని ఆరాధించడం వలన ప్రతి ఒక్కరి జీవితంలో కష్టాలు పోయి శుభాలు జరుగుతాయని నముతారు. లిగరుడ పురాణం చెప్పిందిదే. మహాభారతం, గరుడ పురాణం, నారద పురాణం, రామాయణం, స్కంద పురాణం, వంటి వివిధ పౌరాణిక గాథలలో సర్పాలతో మనకున్న సంబంధంపై అనేక కథలను వివరించాయి. నాగ పంచమి రోజున పాములను పూజించడం వలన భక్తులకు మంచి అదృష్టం మరియు శ్రేయస్సు కలుగుతుందని గరుడ పురాణం పేర్కొంది. దేవతలకు సర్పాలతో అనుబంధం శివుడి మెడలోనే నాగ దేవత ఉండటంతో పాటు, కృష్ణుడికి కూడా సర్పాలతో సంబంధం ఉన్న అనేక కథల ద్వారా హిందువులకు తెలుసు. శ్రీకృష్ణుడిని చంపడానికి కాంస కాళియా అనే సర్పాన్ని పంపినట్లు హిందూ పురాణాలు చెబుతున్నాయి. కృష్ణుడు ఆ సర్పాన్ని ఓడించడమే కాకుండా దాని పడగపై నిలబడి వేణువు వాయించాడు. ఇది కూడా మన దేవతలకు సర్పాలతో ఉన్న సంబంధాన్ని చెప్తుంది.

**నాగపంచమి నాడు పూజలు ఇలా చెయ్యాలి**

కాగా నాగ పంచమి రోజున నాగదేవత కటాక్షం కోసం ముందుగా ఇల్లు శుభ్రం చేసుకుని, తలంటు స్నానం చేసి పూజలు నిర్వహిస్తారు. దగ్గరలో ఉన్న పుట్ట వద్దకు వెళ్లి పసుపు, కుంకుమ, గంధంతో పూజాధికాలు నిర్వహిస్తారు. దీపం వెలిగించి, అగరవత్తులు వెలిగించి నాగదేవతను మనసులో స్మరించుకుని భక్తిగా నమస్కరిస్తారు. కొందరు నాగ దేవత పుట్ట వద్ద నైవేద్యంగా పాలు పోస్తారు. నువ్వులను నైవేద్యంగా సమర్పిస్తారు. ఉపవాస దీక్ష చేస్తారు.

**నాగపంచమి పూజలతో అంతా శుభం**

కొందరు తమ సన్నిహితులకు ఈ రోజు భోజనం పెడతారు. సర్పాలను పూజించిన వారికి ఎలాంటి కష్టాలు రావని చెప్తారు. నాగ దేవతను పూజించినవారికి ఎలాంటి సమస్యలు తొలగిపోతాయని, జీవితంలో సంతోషం, శ్రేయస్సు వస్తుందని నమ్ముతారు. భక్తులు. అందుకే నాగ పంచమి రోజున ప్రముఖ ఆలయాలకు వెళ్లి నాగదేవత పూజలు చేస్తారు .అత్యంత భక్తిభావంతో , ఉపవాస దీక్షతో నాగదేవతను భక్తులు పూజిస్తారు.

# మురికి కాల్వ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

**సూర్య, నాగిరెడ్డిపేట్**



మండల కేంద్రంలోని మాంసం దుకాణాల వీధిలో గ్రామపంచాయతీకి సంబంధించిన మురికి కాల్వను కబ్జా చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కాలనీ వాసులు సోమవారం ప్రజావాణి లో తహశీల్దార్ శ్రీనివాస్ రావు కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ మండల కేంద్రం గోపాల్ పేట్ గ్రామపంచాయతి పరిదిలోని 6వ వార్డ్ మాంసం దుకాణం వీధిలో 2002 సంవత్సరంలో అప్పటి గ్రామపంచాయతీ పాలకులు ఇళ్లలోని మురికి నీరు వెళ్లడానికి మురికి కాల్వను నిర్మించారన్నారు. ప్రస్తుతం ఆ మురికి కాల్వను అదే వీధిలోని సలీం పాషా, వసీం పాషా అనే ఇద్దరు వ్యక్తులు మురికి కాల్వను మొరం మట్టితో మూసివేసి ఎటువంటి గ్రామపంచాయితీ అనుమతులు లేకుండా మురికి కాల్వపై మెట్లను నిర్మించారన్నారు. మురికి కాల్వను మూసివేసి మెట్లు నిర్మించడంతో ఇళ్లల్లోని మురికి నీరు రోడ్డుపై నిలిచి తమ ఇళ్లల్లోకి మురికి నీళ్లు వస్తున్నాయని, దీంతో వీధిలో మురికి నీళ్లతో దుర్వాసన వస్తూ కాలనీ ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. ఈ ఇద్దరు వ్యక్తులు అక్రమంగా మురికి కాల్వను కబ్జా చేసిన విషయాన్ని గత 15 రోజుల క్రితం సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ వారిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామ పంచాయతీకి సంబంధించిన మురికి కాలువను కబ్జా చేసి మురికి కాలువ పై మెట్లు నిర్మించిన వ్యక్తులపై చర్యలు చేపట్టి మురికి కాల్వను తిరిగి వినియోగంలోకి తీసుకురావాలని వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు మంగలి యాదగిరి, సాజిద్, యాదుల్, గణేష్ తదితరులున్నారు.

# రోగులకు సరైన వైద్య సేవలు అందించాలి

## - ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థసారథి రెడ్డి

**సూర్య, నాగిరెడ్డిపేట్**



ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్యులు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి రోగులకు సరైన సేవలు అంది ంచాలని ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థసారథి రెడ్డి సూచించారు. సోమవారం మండల కేంద్రం లోని ప్రభుత్వ ఆసుపత్రి, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను స్థానిక తహశీల్దార్ శ్రీనివాస్ రావు తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు రాకుండా తగిన జాగ్రత్తలు చేపట్టాలని తెలిపారు. వైద్యులు ఎప్పుడూ అందుబాటులో ఉండాలని సూచించారు. అనంతరం కస్తూర్బా గాంధీ పాఠశాలను తనిఖీ చేసి, విద్యార్థినీల విద్యా సామర్థ్యాన్ని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో రికార్డులు తనిఖీ చేసి, ఉపాధ్యాయులతో మాట్లాడారు. విద్యార్థినిలకు సక్రమంగా విద్య బోధన చేస్తూ, మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారాన్ని అందజేయాలని సూచించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహశీల్ధార్ శ్రీనివాసరావు, ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి సృజన్ కుమార్. రెవెన్యూ ఇన్స్ పెక్టర్ మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి పాఠశాలలో గ్రంథాలయం ఉండాలి

**సూర్య బాల్కొండ /ముప్కాల్**



ప్రతి పాఠశాలలో ఒక గ్రంథాల యం ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకోవాలని ముప్కాల్ మండల విద్యాశాఖ అధికారి జె.రవికుమార్ అన్నారు. సోమవారం రోజు ఉదయం ముప్కాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో భాగంగా పాఠశాలలలో గ్రంథాలయాల నిర్వహణ అనే అంశంపై ఒక రోజు మండల స్థాయి శిక్షణ కార్యక్రమంను కొనసాగించారు. పాఠశాలలో గ్రంథాలయం లేదా లైబ్రరీ కార్నర్ ఉండాలని, పాఠశాల విద్యార్థుల చేత గ్రంథాలయ కమిటీలు ఏర్పాటు చేయించేలా కృషి చేయాలని జిల్లా పరిశీ లకులు బోయడ నర్సయ్య అన్నారు. ఎఫ్ఎల్ఎన్ బోధనలో భాగంగా పుస్తక పఠనం చేయించాలని, విద్యార్థుల చేత నేషనల్ బుక్ ట్రస్ట్, రూమ్ టు రీడ్ వారు అందజేసిన పుస్తకాలను చదివించాలని ఈ సందర్భంగా గుర్తుచేశా రు. ఈ సమావేశంలో ముప్కాల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు యం.గం గారాం, రిసోర్స్ పర్సన్లు రవి, నటరాజ్ పాల్గొన్నారు.